క్లుప్తంగా

వేలంలో రూ.60 వేల ఆదాయం

గంగవరం: మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గంగవరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం వేలం పాట నిర్వహించారు. రెండు ద్విచక్రవాహనాలు, కారును రూ.60 వేలకు విక్రయించారు.

నేడు ప్రత్యేక సమావేశం

సదుం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు సచివాలయాల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక పీఎల్ఆర్ భవనంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప హాజరుకానున్నట్టు చెప్పారు.

వధూవరులకు పెళ్లి వస్త్రాల అందజేత



పెళ్లి సారెను అందజేస్తున్న తహసీల్దార్ మాధవరాజు, ఆనందాచార్యులు

చౌడేపల్లె: వధూవరులకు పెళ్లి దుస్తులు, తాళిబొట్లు, మెట్టెలతో కూడి సారెను తహసీల్దార్ మాధవరాజు సోమవారం అందజేశారు. దాత అగ్రహారానికి చెందిన ఆనందాచార్యుల సహకారంతో బజారువీధిలో వెలసిన సాయిబాబా ఆలయంలో పెళ్లికుమార్తె కుటుంబీకులకు అందజేశారు. పుంగనూరు మండలం బండ్లపల్లెకు చెందిన రామయ్య, రత్నమ్మల కుమార్తె మేరీకి చౌడేపల్లె మండలం గడ్డంవారిపల్లెకు చెందిన గురుమూర్తి, శాంతమ్మల కుమారుడు కిరణ్‌కుమార్‌తో వివాహం నిశ్చయమైంది. వీరు పేదలని తెలుసుకున్న దాత ఆనందాచార్యులు ఈ సాయం అందించారు.

3న ఉచిత వైద్య శిబిరం

రొంపిచెర్ల: మండలంలోని పెద్దగొట్టిగల్లు శివాలయం వద్ద మార్చి 3వ తేదీన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మేకల శివగంగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ ఆస్పత్రి, మౌర్య కంటి వైద్య ఆస్పత్రి, మా దంత వైద్యశాల, శ్రీఝాన్సీ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో క్యాన్సర్, కంటి, దంత, నరాలు, ఎముకలు, ఊపిరి తిత్తులు వంటి జబ్బులకు ఉచితంగా చికిత్సలు చేసి మందులు ఇస్తామని తెలిపారు. రోగులకు ఉచిత భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9052030955 సంప్రదించాలని అన్నారు.

నేడు ఉబ్బమ్మ దేవర

కుప్పం: స్థానిక పాతపేట దోబీఘాట్‌లోని శ్రీప్రసన్న ఉబ్బమ్మ దేవస్థానంలో మంగళవారం దేవర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఉదయం చిన్న గంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు, పొంగళ్లు, దీపారాధన నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం జలాదివాసం ఉంటుందన్నారు.

మిశ్రమ దాణా పంపిణీ

సోమల: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో పాడి రైతులకు మిశ్రమ దాణా 15 మెట్రిక్ టన్నులు సబ్సిడీపై పంపిణీ చేసినట్లు పెద్ద ఉప్పరపల్లె పశువైద్యాధికారిణి చందన ప్రియ సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ, ఈ మిశ్రమ దాణా పశువులకు అందిస్తే సరైన పోషక విలువలు లభిస్తాయని చెప్పారు. దీంతోపాటు అధిక పాల దిగుబడి, గర్భ కోశ సమస్యలు రాకుండా ఉపయోగపడుతాయని తెలిపారు. 81 చిన్న ఉప్పరపల్లె పంచాయతీలోని గాంధీ నగర్‌లో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించి 20 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 15 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. రైతులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు నూర్‌మహ్మద్ ఆలీ, బావాజాన్, బలరాం పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్‌గా కందన్

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలోని 7 వార్డు సచివాలయం కన్వీనర్‌గా కందన్‌ను నియమిస్తూ ఎమ్మెల్సీ భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకంపై ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్మన్ సుధీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వడ్డెర కులస్తులు వైఎస్సార్‌సీపీ వెంటే

కుప్పం: నియోజకవర్గంలోని వడ్డెర కులస్తులు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు వడ్డెర సామాజిక వర్గానికి చేసింది శూన్యం అన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వెంకటాపురం గ్రామంలోని పలువురు వడ్డెరులు గత వారం వైఎస్సార్‌సీపీలో చేరడం శుభపరిణామమన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భరత్‌ను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈసారి కుప్పంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వడ్డెర సంఘ నాయకులు వినాయక్, రవి, వీరభద్ర, మణి, కృష్ణ ఉన్నారు.

మల్చింగ్ వ్యవసాయం!

జిల్లాలోని పడమటి మండలాల రైతులు వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. వినూత్న విధానాలతో పంటలు పండిస్తున్నారు. అందులో భాగంగా మల్చింగ్ పద్ధతి పాటిస్తూ అద్భుత ఫలితాలు పొందుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకుంటూ తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తులు సాధిస్తున్నారు. నీటి ఆదాతోపాటు కలుపు సమస్య లేకపోవడంతో పెద్ద సంఖ్యలో అన్నదాతలు మల్చింగ్ ప్రక్రియపై ఆసక్తిచూపుతున్నారు. ఉద్యానశాఖ అధికారుల ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుంటూ ముందడుగు వేస్తున్నారు.

- తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు
- ఒకే ఖర్చుతో రెండు పంటలు
- చీడపీడలకు చెల్లుచీటీ
- హెక్టారుకు రూ.16వేలు అందిస్తున్న ప్రభుత్వం



చెన్నుపల్లి వద్ద రైతు పొలంలో అమర్చిన మల్చింగ్



వీకోట మండలంలో మల్చింగ్ పై సాగైన టమోటా పంట

పలమనేరు : జిల్లాలోని రైతులు మల్చింగ్ విధానంలో పంటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటి వరకు కర్ణాటకు మాత్రమే పరిమితమైన ఈ పద్ధతి ఇప్పుడు పడమటి మండలాల్లోనూ ఊపందుకుంది. ప్రస్తుతం ఒక్క పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోనే సుమారు 1000 ఎకరాల వరకు మల్చింగ్‌తో పంటల సాగు సాగుతోంది. ప్రభుత్వం సైతం రైతు భరోసా కేంద్రాల ద్వారా మల్చింగ్ సాగుకు చేసే రైతులకు ఆర్థిక సాయం అందిస్తోంది. హెక్టారుకు సబ్సిడీ కింద రూ.16వేలు పంపిణీ చేస్తోంది.

మల్చింగ్ అంటే..

మొక్క చుట్టూ ఉన్న ప్రాంతాన్ని ఏదో ఒకదాంతో కప్పి ఉంచడాన్ని మల్చింగ్ అంటారు. గతంతో వడ్ల పొట్టు, రంపపు పొట్టు, చెరుకు పిప్పి, ఎండిన ఆకులు, వరిగడ్డి, కొబ్బరి పీచులతో కప్పి పెట్టేవారు. ఇప్పుడు వీటి స్థానంలో పలు రకాల మైక్రాన్ కలిగిన ప్లాస్టిక్ పేపర్లు అందుబాటులోకి వచ్చాయి.

మల్చింగ్ ఇలా చేయాలి..

కూరగాయలు, పూల సాగుకు మల్చింగ్ అనుకూలం. కూరగాయ పంటలైన టమాట, బీన్సు, వంగ, క్యాప్సికం తదితర పంటలతోపాటు పూల సాగుకు 50 నుంచి వంద మైక్రాన్ల ప్లాస్టిక్ పేపర్‌ను మల్చింగ్‌గా వేసుకోవచ్చు. అరటి, బొప్పాయి తదితర పంటలకు వందకంటే ఎక్కువ మైక్రాన్ల పేపర్‌ను ఉపయోగించుకోవచ్చు. దుక్కి దున్నుకున్నాక బోదెలు సిద్ధం చేసుకుని ప్లాస్టిక్ పేపర్ వేసి మట్టిని కప్పుకోవాలి. ఆపై కావాల్సిన చోట రంధ్రాలు చేసి అందులో విత్తనాలు, లేదా మొలక వేసుకోవచ్చు.

హెక్టారుకు రూ.16వేలు

హెక్టారు పొలంలో మల్చింగ్ చేయాలంటే 600 మీటర్ల పొడవుగల మల్చింగ్ షీట్ కావాలి. మీటర్ ధర రూ.53 చొప్పున రూ.32వేలు ఖర్చు వస్తుంది. ఇందులో 50శాతం ఉద్యానశాఖ రూ.16వేలు చొప్పున రాయితీనిస్తోంది.

లాభాలెన్నో..

- ఎకరా పంటకు వినియోగించే నీటితోనే మూడెకరాలు సాగు చేసుకోవచ్చు
- సాధ్యమైనంత వరకు కలుపును నివారించుకోవచ్చు
- కూలీల ఖర్చులు తగ్గుతాయి
- తెగుళ్లు, చీడపీడల సమస్యలు తక్కువ
- వారానికోసారి నీటి తడులు సరిపోతాయి
- 30 శాతం పంట దిగుబడి పెరుగుతుంది
- పంట కాలాన్ని 40 శాతం వరకు పొడిగించుకోవచ్చు
- రసం పీల్చే పురుగులు బెడద తగ్గుతుంది
- భూమిలో తేమ చాలా కాలం ఉంటుంది
- అదేభూమిలో రెండోపంటను సాగుచేసే అవకాశం
- కూలీలు, పురుగు మందుల పిచికారీ, సస్యరక్షణ తగ్గడంతో ఎకరానికి రూ.20 వేల వరకు ఆదా చేసుకోవచ్చు

మూడు హెక్టార్లలో సాగుచేస్తున్నా



కర్ణాటకలో మల్చింగ్ విధానంలో సాగు చేయడం చూశా. అక్కడి రైతులతో మాట్లాడి ఈ పద్ధతిలో వచ్చే లాభాలను తెలుసుకున్నా. మూడేళ్లుగా పలు రకాల పంటలను మల్చింగ్‌తోనే సాగుచేశా. పంట దిగుబడి బాగా వచ్చింది. ముఖ్యంగా కలుపు సమస్య తగ్గడంతో కూలీల ఖర్చు చాలా వరకు మిగిలింది. ఇప్పుడు మూడు హెక్టార్లలో మల్చింగ్‌తో టమాట సాగుచేస్తున్నా. ఈ విధానం రైతులకెంతో లాభదాయకం. –సుబ్రమణ్యంరెడ్డి, రైతు, కల్లాడు, పలమనేరు మండలం

సబ్సిడీ ఇస్తున్నాం



మల్చింగ్ విధానం ద్వారా చాలా లాభాలున్నాయి. ముఖ్యంగా భూమిలో మైక్రో క్లెమైట్ అభివృద్ధి చెందుతుంది. తద్వారా పంట దిగుబడి పెరిగి నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చు. మల్చింగ్‌తో సాగుచేసిన రైతులు మల్చింగ్ షీట్ కొన్న బిల్లు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్ కార్డులను ఆయా ఆర్‌బీకేలో సమర్పించి దరఖాస్తు చేసుకోవాలి. మా సిబ్బంది పొలాన్ని సందర్శించిన తర్వాత, హెక్టారుకు రూ.16వేల సబ్సిడీ సొమ్మును రైతు ఖాతాలోకి జమచేస్తాం. –కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక



ఉమేష్‌కార్తీక్

పుంగనూరు: మండలంలోని రాజులూరు ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న ఉమేష్‌కార్తీక్ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో 252 మార్కులు సాధించాడు. సోమవారం ఈ విషయాన్ని బాలుడు తండ్రి సురేష్‌బాబు తెలిపారు. బాలుడి తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే. ఉమేష్ కార్తీక్ సైనిక్‌స్కూల్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రవేశానికి అర్హత సాధించడంపై పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

హౌసింగ్ పురోగతిపై సమీక్ష నేడు

శాంతిపురం: మండలంలో హౌసింగ్, రెవెన్యూ శాఖల పురోగతిపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి ఓ ప్రకటనలో తెలిపారు. మండల సచివాలయ మీటింగ్ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు విధిగా నివేదికలతో హాజరు కావాలని కోరారు.

శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుందాం



జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన శ్యాంప్రసాద్‌రెడ్డి గెలుపునకు పార్టీ నాయకులు కృషి చేయాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. సోమవారం రామకుప్పం మండలం ఆకందగానిపల్లిలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలో భారీ మెజార్టీ రావాలన్నారు. పంచాయతీల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళిక గురించి ఓటర్లకు వివరించాలన్నారు.

జగనన్న లే అవుట్ పరిశీలన

బందార్లపల్లి పంచాయతీ బగళనత్తం గ్రామంలోని జగనన్న లే అవుట్‌ను ఎమ్మెల్సీ భరత్ పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్ రాజ్‌గోపాల్, ఏఎంసీ డైరెక్టర్ సురేంద్రరెడ్డి, కేశవ రెడ్డి ఉన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా పర్యటించండి

పులిచెర్ల(కల్లూరు): పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపిద్దామని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విస్తృతంగా గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉన్న పట్టభద్రులైన ఓటర్లను కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారని, అభివృద్ధి కోసం తిరిగి ఇదే ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరారు.



ఇర్లపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముమ్మర ప్రచారం

సోమల: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించాలని ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు కోరారు. పొదలగుంటపల్లె, 81 చిన్న ఉప్పరపల్లె పంచాయతీలలో సోమవారం సచివాలయాల మండల కన్వీనర్ రాశెట్టి మధు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. వారు పట్టభద్రులను కలిసి శ్యాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణం రెడ్డి, సర్పంచ్ జయరాం, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శీలం భాస్కర్, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, నేతలు వరదం రమణ, డిశెంబర్ రావు, హరీష్, శివమూర్తి, మహేష్, సరస్వతమ్మ, సోమల మాజీ సర్పంచ్ శ్రీరాములు, సచివాలయ కన్వీనర్లు సిద్ధయ్య, గంగులప్ప పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలుపై దృష్టి



ప్రసంగిస్తున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలుపై దృష్టి పెట్టి, సకాలంలో వసూలు చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. ఆయన సోమవారం ఎంపీడీవో కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో మండలం వెనుకబడి ఉందని సకాలంలో ప్రజలు ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. త్వరలో మండలంలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ పర్యటించనున్నట్లు చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కార్యదర్శులు పన్నుల చెల్లింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, వైస్‌ఎంపీపీ విజయశేఖర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుండలు సిద్ధం





పుంగనూరులో విక్రయాలకు సిద్ధం ఉన్న మట్టికుండలు

పుంగనూరు: వేసవిలో మట్టికుండల్లో మంచినీటిని నిల్వ చేసుకుంటే, చల్లగా ఉంటాయి. ఈ నీరు ఎంతో శ్రేష్టం. రిఫ్రిజిరేటర్లు, వాటర్ కూలర్లు ఉన్న వారు సైతం మట్టి కుండల్లో నీటిని తాగడానికే ఇష్టపడుతారు. ఈ నేపథ్యంలోనే పట్టణంలోని కుమ్మర వీధిలో సుమారు 10 కుటుంబాల వారు కుండలు విక్రయించి జీవనం చేస్తున్నారు. వేసవి ప్రారంభం కావడంతో ఇంటినిండా కుండలు తయారు చేసి సిద్ధం చేసుకున్నారు. ఒక్కొక్క కుండ రూ.50 నుంచి 100 వరకు విక్రయిస్తున్నారు. మార్చి 14, 15 తేదీల్లో శ్రీసుగుటూరు గంగమ్మజాతరలో అమ్మవారి మొక్కులు చెల్లించుకునేందుకు ప్రజలు మట్టికుండల్లో గెరిగెలు తీసుకుని మొక్కులు చెల్లిస్తారు. ఇందు కోసం కుండలు సిద్ధం చేశారు.

ఉపాధి పనుల పరిశీలన



రాజులపల్లెలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుగుణమ్మ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని రాజులపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఎంపీడీఓ సుగుణమ్మ పరిశీలించారు. చెరువుల్లో పూడిక తీత పనులను పరిశీలించి కట్టలు మరింత బలోపేతం చేయాలన్నారు. నీటి నిల్వ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పనుల వద్ద కూలీల సంఖ్య పెంచాలని, వేసవి కావడంతో పనుల వద్ద తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని స్పష్టం చేశారు. అనంతరం వెంకటదాసరపల్లె సచివాలయాన్ని తనిఖీ చేసి, స్పందనలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఏపీఓ సౌకత్ అలీ, ఈసీ క్రిష్ణ పాల్గొన్నారు.

రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మొగిలి ఆలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించారు. శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేకాలు చేశారు.

దర్జీలకు 'చేదోడు'

- చేదోడు పథకంతో దర్జీలకు చేయూత
- సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న టైలర్లు
- నేడు ప్రపంచ టైలర్ల దినోత్సవం



పొలసముద్రం: సమాజంలో వ్యక్తి హోదాను సూచించేది వారు ధరించే వస్త్రాలే. ఆ వస్త్రాలు కుట్టే దర్జీలకు ఒకప్పుడు ఊపిరి సలపడానికి సమయం ఉండేది కాదు. కానీ నేడు మార్కెట్‌లోకి తక్కువ ధరకే రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో దర్జీలకు పని దొరకడం కష్టమైందన్నది నాటి మాట. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 2021 నుంచి జగనన్న చేదోడు పథకం ద్వారా అర్హులైన దర్జీల ఖాతాలో ఏడాదికి రూ.10 వేల వంతున సర్కారు జమ చేస్తోంది. దీంతో వారి జీవితాల్లో వెలుగులు నిండాయి. నాడు దర్జీ వృత్తి వదలి ఇతర పనులకు వెళ్లిన వారందరూ మళ్లీ కుట్టు పనులు చేసుకుని, హాయిగా జీవనం సాగిస్తున్నారు. పథకం అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

దర్జీల పితామహుడు విలియమ్స్ హావే

దర్జీల పితామహుడు జర్మనీ దేశస్తుడైన విలియమ్స్ హావే 1846లో కుట్టు మిషన్ కనిపెట్టారు. అది నిముషానికి 250 కుట్లు వేసేది. అలా తయారైన కుట్టు మిషన్ రూపాంతరం చెంది నేడు ఎలక్ట్రిక్ కుట్టు మిషన్లు వచ్చాయి. దీంతో ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. 1867 విలియమ్స్ హావే ఈ లోకం వదలినా, ఆయన పేరు స్మరించుకుంటూ దర్జీలందరూ ఆయన పుట్టిన రోజైన ఫిబ్రవరి 28వ తేదీని ప్రపంచ టైలర్స్‌డేని జరుపుకుంటున్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

2013 ఎన్నికలకు ముందు నాటి వైఎస్సార్ ప్రభుత్వం రూ.కోటితో హైదరాబాద్‌లో ఫెడరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించినా దాన్ని టీడీపీ ప్రభుత్వం రద్దు చేసిందని దర్జీలు వాపోతున్నారు. తమ బాధలను అర్థం చేసుకున్న ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే దర్జీల సంక్షేమానికి ఆర్థిక సాయం చేస్తున్న ఆయనకు రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

దర్జీలను ఆదుకోవాలనే ఆలోచన వైఎస్సార్‌దే

చేతనైన వృత్తిని వదలలేక, కొత్త వృత్తిని చేపట్టలేక దర్జీలు సతమతమవుతున్న తరుణంలో వైఎస్సార్ వారి జీవితాల్లో వెలుగులను ప్రసాదించేందుకు 2009 మార్చి ఒకటో తేదీన జీఓ ఎంఎస్ నంబర్ 86 విడుదల చేశారు. చెన్నై, కేరళ ప్రభుత్వాల తరహాలో రాష్ట్రంలో కూడా దర్జీలకు సదుపాయాలు అందజేయాలని ఆకాంక్షించారు. 2009 మే14న రాష్ట్ర ప్రభుత్వం 283బీ, 12008–2 ద్వారా ఆంధ్రప్రదేశ్ దర్జీలను కో–ఆపరేషన్ సొసైటీ ఫెడరేషన్‌గా ప్రతిపాదించింది. దీంతో రాష్ట్రంలోని దర్జీలకు ప్రయోజనం చేకూరుతుందని తలచిన వైఎస్సార్ పారిశ్రామిక ఫెడరేషన్ ఏర్పాటుకు ఆదేశించారు. జీఓ జారీ చేసిన తరువాత రూ.కోటి నిధుల కూడా కేటాయించారు. అయితే వైఎస్సార్ మరణాంతరం ప్రభుత్వాలు చేనేత జౌళి శాఖకు నిధులు కేటాయించకపోవడంతో దర్జీల పరిస్థితుల్లో మార్పు కనిపించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత వైఎస్సార్ పథకం ద్వారా దర్జీల ఖాతాల్లో రూ.10 వేలు ప్రతి ఏడాది జమ చేస్తూ వాని జీవితాల్లో వెలుగు నింపారు.